ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ప్రజల సహకారంతో ముందుకెళ్తా

- తుగ్గలి ముఖాముఖిలో వైఎస్.జగన్

ప్రజాశక్తి-తుగ్గలి

ఐదేళ్లలోఅన్నివర్గాల ప్రజలకు ఎంతో మేలు చేశామని, ప్రజల సహకారంతోనే ముందుకెళ్తామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం కర్నూలు జిల్లా తుగ్గలి మండల పరిధిలోని రాతన, తుగ్గలి, జొన్నగిరి, ఎర్రగుడి, తదితర గ్రామాల మీద మేము సిద్ధం బస్సు యాత్రను నిర్వహించారు. తుగ్గలిలో పత్తికొండ మాజీ ఎమ్మెల్యే తమ్మారెడ్డి కుమారులు ప్రతాపరెడ్డి ప్రహల్లాద రెడ్డి చిత్రపటాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తుగ్గలిలో నవరత్నాల లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. సిఎం మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 50 నుంచి 70 ఇళ్లకు ఒక వాలంటీర్ చొప్పున 2.26 లక్షల వాలంటీర్లను నియమించి వారి ద్వారా ప్రజలకు ప్రతి సంక్షేమ పథకాన్ని అందించామన్నారు. అదేవిధంగా వైఎస్ ఆరోగ్యశ్రీ పరిమితి రు. 25 లక్షల దాకా పెంచామన్నారు. 10132 విలేజ్ హెల్త్ క్లినిక్స్, పట్టణ ప్రాంతాల్లో 562 అర్బన్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశామన్నారు. వైద్యం కోసం డాక్టర్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా గ్రామాలలోనే ఏర్పాటు చేశామన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా రైతు భరోసా కేంద్రాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ బాగా ఉండాలనే ఉద్దేశంతోనే ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు. గ్రామాలలో ఏర్పాటుచేసిన సచివాలయాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. వివిధ పథకాల ద్వారా ప్రతి గ్రామ సచివాలయానికి రూ. 50 కోట్ల మేర ఖర్చు చేసి అభివృద్ధి చేశామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. సిఎం మాట్లాడుతూ రాష్ట్రంలో సచివాలయం వ్యవస్థ ద్వారా అన్ని గ్రామాలు పూర్తిగా అభివృద్ధి చెందాయన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా 58 నెలలోనే అంత అభివృద్ధి చేసామన్నారు. ప్రజలు కష్టాలు బాధలు తెలుసుకోవడానికి సిద్ధం బస్సు యాత్రను ఏర్పాటు చేశామన్నారు. గ్రామ వార్డు సచివాలయాల ఏర్పాటు ద్వారా 1,35, 819 శాశ్వత ఉద్యోగాలను అందించామన్నారు.

రైతులకు రుణమాఫీ చేయాలి: రాతన శ్యామల

వర్షాభావ పరిస్థితులు కారణంగా కొట్టుమిట్టాడుతున్న రైతులను ఆదుకోవడానికి రుణమాఫీ చేయాలని తుగ్గలి మండలం రాతన గ్రామానికి చెందిన శ్యామల ముఖ్యమంత్రికి వివరించారు. వర్షం పడితే తప్ప పంటలు చేతికి రావని, పంటలు పండక పోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆమె వాపోయారు.

మాట్లాడుతున్న ముఖ్యమంత్రి జగన్

తుగ్గలిని కరువు మండలంగా ప్రకటించలేదు: సూరన్న

నిత్యం కరువుతో అల్లాడుతున్న కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం తుగ్గలి మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించలేదని, దీంతో ఆందోళనకు గురి అవుతున్నారని సిఎం ఎదుట రైతు వాపోయారు. తుగ్గలి మండలంలోని చెరువులన్నింటినీ నీటితో నింపకపోవడంతో తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని సిఎం దృష్టికి తెచ్చారు.

ప్రభుత్వము మరిన్ని పథకాలు అందించాలి: ఎలాజీబెత్ తుగ్గలి

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందరికీ సక్రమంగా అందుతున్నాయని, ఇంకా మరిన్ని పథకాలు అందిస్తే ప్రజల మరల జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చూస్తారని అన్నారు. మంత్రి పెద్దరెడ్డి రామచంద్రారెడ్డి, వైసిపి రాయలసీమ ఇంచార్జ్ రామసుబ్బారెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కె.శ్రీదేవి, ఎంపీ అభ్యర్థి బివై రామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి సిపిఎంను గెలిపించండి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పోరాటయోధుడు సిపిఎం అభ్యర్థిని నగరం అభివద్ధి చెందుతుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రామన్న, నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, ఐలు నగర కార్యదర్శి లక్ష్మణ్ అన్నారు. కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని (49,50 వార్డులు) నరసింగరావుపేట, కొత్తపేట ప్రాంతంలో సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని కరపత్రం పంపిణీ చేసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ నగర కార్యదర్శి సి.లక్ష్మణ్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం రాష్ట్ర నాయకులు రామన్న, నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ కర్నూలు నగరంలోని నరసింగరావుపేట, కొత్తపేట ప్రాంతాలలో ప్రతి ఇంటికి కరపత్రం పంపిణీ చేసి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సిపిఎం అభ్యర్థి సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి వేయించి అఖండమైన మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చట్టసభలకు ఎన్నికైన ప్రజా ప్రతినిధులు వారు ఏ పార్టీకి చెందిన వారైనా ప్రజల సమస్యలపై చట్టసభల్లో మాట్లాడకపోగా వ్యక్తిగత దూషణలకు శాసనసభను, పార్లమెంటును వేదికగా చేసుకుంటున్నారని ప్రజా సమస్యలపై చర్చ ఉండదని అన్నారు. మా పార్టీ గుర్తుపై ఓటు వేసి 25 మంది ఎంపీలను గెలిపిస్తే ప్రధానమంత్రి మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్ ఆయన జైలుపాలు కాకుండా చూసుకోవడానికి సాగిలాపడి ప్రధానమంత్రి కాళ్లు మొక్కడం నిత్య కృత్యమైందని విమర్శించారు. గతంలో సిపిఎం ముఖ్య మంత్రులుగా చేసినవారు జ్యోతి బస్, మాణిక్ సర్కార్, బుద్ధదేవ్ బట్టా, అచ్చుతానందన్ ఇలాంటి వారి ఆస్తులు కూడేసుకోకుండా నిస్వార్ధంగా ప్రజాసేవ చేశారన్నారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆస్తి లక్షల కోట్లలో పెరిగిందని, ఓట్లు వేసిన ప్రజలకు ధరలభారం, పన్నుల భారం తప్ప రాష్ట్ర ప్రజలకు ఒరిగింది ఏమి లేదని ప్రచారంలో భాగంగా ప్రజలకు తెలిపారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా ఒక్క పరిశ్రమ నెలకొల్పకపోవడం విడ్డూరంగా ఉందని, ప్రభుత్వ రంగ సంస్థలను ఆదానీ, అంబాని గ్రూపులకు కారు చౌకగా అప్పజెబుతున్నారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై నిప్పులు చెరిగారు. ఈ దేశంలో అన్నం పెట్టే రైతుకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని, రైతు హక్కులు అడిగితే లాఠీలతో కుల్లపొడుస్తున్నారని, అవసరం అనుకుంటే కాల్చి చంపుతున్నారని, బ్యాంకులను లూటీ చేసిన కార్పొరేట్ శక్తులకు రాయితీలు ఇచ్చి ఆదుకుంటున్నారని అందుకే కేంద్రంలో ఉండే బిజెపి, టిడిపి కూటమిని, వైసిపిని ఓటు అనే ఆయుధంతో తరిమి కొట్టాలని సిపిఎం గుర్తు సుత్తి, కొడవలి, నక్షత్రంపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఏరియా నాయకులు అనీఫ్, సిపిఎం నగర నాయకులు మా భాష, కుమార్, రంగప్ప, అమర్ పాల్గొన్నారు.

పిఒ, ఎపిఒల పాత్ర కీలకం

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రానున్న సాధారణ ఎన్నికల నిర్వహణలో పిఒ, ఎపిఒల పాత్ర కీలకమని, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. శనివారం కర్నూలు ఎంఆర్‌సి కన్వెన్షన్ సెంటర్ లో సాధారణ ఎన్నికల-2024 నిర్వహణపై మొదటి సెషన్‌లో మంత్రాలయం, ఆలూరు, రెండోవ సెషన్‌లో ఎమ్మిగనూరు, పత్తికొండ నియోజకవర్గాల పిఒలు, ఎపిఒలకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికలకు మే 13న పోలింగ్ నిర్వహించనున్నామని, సంబంధిత పోలింగ్ కార్యక్రమంలో ముఖ్య పాత్ర పోషించనున్న పిఒ, ఎపిఒలకు ఇవిఎమ్ మెషీన్ కనెక్షన్ ఏ విధంగా ఇవ్వాలి, కొత్తగా వచ్చిన నియమాల మీద, ప్రొసీజర్ల మీద పిఒ, ఎపిఒలకు హ్యాండ్సన్ ట్రైనింగ్ ఇవ్వడం కోసమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశం అన్నారు. ఎన్నికల్లో విధులు నిర్వహించే జిల్లా ఎన్నికల అధికారి నుండి పోలింగ్ స్టేషన్లో ఉండే పిఒ, ఎపిఒ, ఒపిఒల వరకు రాజ్యాంగబద్ధమైన బాధ్యతను నిర్వహిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి ఐదేళ్లకోసారి నిర్వహించే ఈ బాధ్యతను పూర్తి నిబంధనతో, నిజాయితీతో, అవగాహనతో చేయాల్సిన అవసరం ఉంటుందనే విషయం ఇక్కడ హాజరైన అందరికీ తెలిసి ఉండొచ్చునన్నారు. ఎలక్షన్‌కు నియమ నిబంధనలు అప్డేట్ అవుతూనే ఉంటాయని, గతంలో నిర్వహించిన ఎన్నికల విధుల అనుభవం మనకు పనికొస్తుందన్నారు. నియమాలు మారుతున్నాయనే విషయాన్ని మనం అవగాహన చేసుకుని ఎప్పటికప్పుడు వచ్చిన నియమాలను, ఇచ్చిన హ్యాండ్ బుక్స్‌ను పూర్తిస్థాయిలో క్షుణ్ణంగా చదువుకొని అవగాహన చేసుకోవాల్సిన అవసరం మన మీద ఉంటుందన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి రవాణా, భోజన సదుపాయంతో పాటు అవసరమైన ఫర్నీచర్‌ను కూడా పూర్తి స్థాయిలో అందజేస్తామన్నారు. మే 12వ తేదీ సాయంత్రం నాటికి దాన్ని ఆర్గనైజ్ చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రంలో ఇచ్చిన సామగ్రిని ఉపయోగించుకొని ఇచ్చిన లేఅవుట్ ప్రకారం ఏర్పాటు చేసుకోవాలని, లేకపోతే రూమ్ బట్టి టేబుల్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఇవిఎమ్ డెమోన్‌స్ట్రేషన్, పిఒ డైరీ మీద, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్ తేజ, పత్తికొండ ఆర్‌డిఒ రామలక్ష్మి మాక్ పోల్ , ఇవిఎమ్ డెమోన్‌స్ట్రేషన్ మీద, ఎమ్మిగనూరు రిటర్నింగ్ అధికారి చిరంజీవి డాక్యుమెంటేషన్ (ఫైలింగ్ ఆఫ్ పిఒ రిపోర్ట్, ఫైలింగ్ ఆఫ్ పిఒ డైరీ), కర్నూల్ ఆర్‌డిఒ శేషి రెడ్డి , మంత్రాలయం రిటర్నింగ్ అధికారి డాక్యుమెంటేషన్ మీద పిఒ, ఎపిఒలకు శిక్షణ ఇచ్చారు.

అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

హామీల్లేని పర్యటన...

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి 'మేమంతా సిద్ధం' పేరుతో చేపట్టిన బస్సు యాత్రతో రెండు రోజుల పాటు ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో తొలి రోజు బస్సు యాత్ర ప్రారంభమైంది. సిరివెళ్ల మండలం ఎర్రగుంట్లలో గ్రామస్తులతో జగన్ ముఖాముఖి నిర్వహించారు. గ్రామానికి వైసిపి ప్రభుత్వం చేసిన వాటి గురించి ప్రజలకు వివరించారు. అనంతరం యాత్ర నంద్యాలకు చేరుకుంది. నంద్యాల డిగ్రీ కళాశాల మైదానంలో 'మేమంతా సిద్ధం' బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో జగన్ జిల్లాకు ఎలాంటి హామీల ఊసే ఎత్తలేదు. నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి నంద్యాలను మున్సిపల్ కార్పొరేషన్‌గా చేయాలని, నంద్యాల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేయాలని, రింగ్ రోడ్డు ఇవ్వాలని ప్రతిపాదించినా జగన్ వాటి ప్రస్తావన తీసుకు రాలేదు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర రెండో రోజు కర్నూలు జిల్లాలో సాగింది. కర్నూలు జిల్లా పెంచికలపాడు నుంచి బస్సు యాత్ర ప్రారంభమైంది. కోడుమూరులో జగన్ చేనేతలతో మాటా మంతీ నిర్వహించారు. కైరవాడి, గోనెగండ్ల, రాళ్లదొడ్డి మీదుగా ఎమ్మిగనూరు వరకు యాత్ర సాగింది. ఎమ్మిగనూరు వీవర్స్ కాలనీ మైదానంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ ప్రసంగంలోనూ హామీలను ప్రస్తావించలేదు. జిల్లాకు ఏం చేస్తామో చెప్పలేదు. ఎమ్మిగనూరు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక నీటి సమస్య నివారణ కోసం లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నిర్మించాలని, చేనేత క్లస్టర్ ఏర్పాటు చేయాలని కోరినా వాటి మీద కూడా జగన్ స్పందించలేదు.

భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ వర్ధంతి

జిల్లాలోని వీధివీధినా, వాడవాడలా భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ 93వ వర్ధంతి కార్యక్రమాలను ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. వారి స్ఫూర్తితో రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు పోరాడాలని కోరారు.

ఉల్లికి దక్కని గిట్టుబాటు ధర

ఆరుగాలం శ్రమకోర్చి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. రైతులకు గిట్టుబాటు ధరలు లభించకపోవడం, పంటల దిగుబడుల కోసం పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పొలాల్లోనే పంటను నిల్వ ఉంచుతున్నారు. ఈ ఏడాది రబీ సీజన్ కింద రైతులు ఉల్లి పంటను సాగు చేశారు. పంట దున్నకాలు, విత్తనాలు, ఉల్లి నాటు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, కూలిలు వంటి ఖర్చులతో కలిపి ఎకరాకు రూ. లక్ష దాకా పెట్టుబడి పెట్టారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు తలొగ్గిన రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ఉల్లి పంటకు ఎగుమతి నిషేధం విధించడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఉల్లి పంట ధర రోజురోజుకు దిగజారిపోవడంతో దిగుబడులను పొలాల్లోనే ఉంచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పంటకు గిట్టుబాటు ధర లేక నష్టాలు చవి చూడాల్సిన దుస్థితి దాపురించింది.

టిడిపి తుది జాబితా విడుదల

టిడిపి అధిష్టానం తుది జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో ఆలూరు నియోజకవర్గ టిడిపి అభ్యర్థిగా బి.వీరభద్ర గౌడ్‌ను ఖరారు చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలు, 14 అసెంబ్లీ నియోజకవర్గ స్థానాలు ఉండగా తొలి జాబితాలో జిల్లాలో తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. రెండో జాబితాలో ముగ్గురు అభ్యర్థులను ఖరారు చేశారు. మూడో జాబితాలో ఇద్దరు ఎంపీ అభ్యర్థులను ఖరారు చేశారు. తాజాగా తుది జాబితాలో ఆలూరు స్థానాన్ని ప్రకటించారు. ఆలూరు టికెట్ కోసం కోట్ల సుజాతమ్మ, వైకుంఠం జ్యోతి, వీరభద్ర గౌడ్ పోటీ పడగా చివరికి ఆ టికెట్ వీరభద్ర గౌడ్‌ను వరించింది. ఆదోని స్థానాన్ని ఇటీవల బిజెపి అభ్యర్థికి కేటాయించిన విషయం తెలిసిందే.

రన్ ఫర్ జీసస్ విజయవంతం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నగర యూనిటెడ్ చర్చీల ఆధ్వర్యంలో సిటీ పాస్టర్ అసోసియేషన్ , సహకారంతో శనివారం రాక్ వుడ్ చర్చిలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. కమిటీ చైర్మన్ రేవ ఆర్ఆర్‌డి. సజీవరాజు, జెండా ఊపి ప్రారంభించన అనంతరం ఆయన మాట్లాడారు. క్రైస్తవుల ఐక్యత కోసం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం రాకుడ్ చర్చి నుంచి ప్రారంభమై మౌర్య ఇన్, రాజ్ విహార్, కలెక్టరేట్ మీదుగా, ప్రార్ధన మందిరం చర్చి సిక్యాంప్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో స్టాంటల్ మెమోరియల్ చర్చి కొరియోగ్రఫీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కోల్స్ చర్చి అధ్యక్షులు అబ్రహం లింకన్, రేవ్ ఫ్రిడిపాల్, సురేష్ , డేవిడ్ పాల్ ,సిటీ పాస్టర్ అసోసియేషన్ కార్యదర్శి, ఆర్. దాసు హోసన్న మందిర్ సంఘ కాపరి, ఫ్రైడీ పాల్ తదితరులు పాల్గొన్నారు.



క్రమశిక్షణ కమిటీచైర్మన్ నియామకం

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

జిల్లా కాంగ్రెస్ కమిటీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉండవెల్లి వెంకటన్నను నియమించామని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కె. బాబురావు వెల్లడించారు. శనివారం డిసిసి కార్యాలయంలో ఆయనకు డిసిసి అధ్యక్షుడు క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షుడు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ గల పార్టీ అని ప్రతి ఒక్కరూ విలువలకు, క్రమశిక్షణకు కట్టుబడి పార్టీలో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, జిల్లా కాంగ్రెస్ ప్రణాళిక కమిటీ చైర్మన్ విశ్రాంత ఉన్నతాధికారి ఎస్.రామస్వామి, డిసిసి ప్రధాన కార్యదర్శులు షేక్ నవీద్, కె.సత్యనారాయణ గుప్త, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎస్ ప్రమీల, ఒబిసి రాష్ట్రప్రధాన కార్యదర్శి సి వెంకట రాముడు పాల్గొన్నారు.

మతోన్మాద బిజెపిని ఓడించండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వైసివి, టిడిపి, జనసేన పార్టీలకు ఓట్లేస్తే బిజెపికి వేసినట్లేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కర్నూలు సూర్జిత్ భవన్‌లో శనివారం 11, 12 వార్డుల కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రజలపై రోజురోజుకు భారాలు వేస్తూ, ధరలను విపరీతంగా పెంచిన బిజెపి దాని మిత్రపక్షాలు, వైసిపికి ప్రజలను ఓటు అడిగే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. రాజ్యాంగంలో అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కు అనే ఆయుధంతో ఈ ఎన్నికల్లో ప్రజలు బిజెపి, వైసిపి, టిడిపి, జనసేనలకు బుద్ధి చెప్పాలని కోరారు. ప్రజల ఆస్తులను సంపన్నులకు కట్టబెట్టి వారి వద్ద నుండి ఎన్నికల బాండ్ల రూపంలో అవినీతి సొమ్మును బిజెపి దాని మిత్రులు దోచుకున్నారని అన్నారు. బిజెపి, వైసిపి, టిడిపి, జనసేన పార్టీల తరపున ఎన్నికయ్యే ఎమ్మెల్యేలు ఎంపీలు సొంత ఆస్తుల పెంచుకోవడానికి ఎన్నికల్లో డబ్బులు ఖర్చు పెట్టి అధికారంలోకి వస్తారని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. గతంలో సిపిఎం ఎమ్మెల్యేగా అప్పుడు ఎంఏ గఫూర్‌కు అధికారమిచ్చిన సందర్భంగా కర్నూలు నగర ప్రజలకు 34 వేల మందికి ఇల్లు, ఇల్లు పట్టాలు ఇచ్చారని తెలిపారు. కర్నూల్ దాహార్తిని తీర్చడానికి కోట్లాది రూపాయలతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ను , కర్నూలు నగరంలో ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మించిన ఘనత సిపిఎం పార్టీది, ఎంఏ.గఫూర్‌దని అన్నారు. సిపిఎం ప్రచారం సందర్భంగా కర్నూలు నగర ప్రజలందరికీ తెలియజేయాలని కార్యకర్తలను కోరారు. కర్నూలు నగరంలో ప్రజలు స్థానిక సమస్యలు పరిష్కారానికి సిపిఎం గతంలో అనేక పోరాటాలను చేసి సమస్యలు పరిష్కరించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు గోవిందు, సిపిఎం పార్టీ కార్యకర్తలు దేవ సహాయం, సిద్దయ్య, ఎర్రశీను, సుంకన్న, కేషాలు, నరసింహులు, గురుస్వామి, కృష్ణ, అనిల్, రఘు, మణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి

ఇంటిగ్రేటెడ్ బస్సుటెర్మినల్ అభివృద్ధి ప్లాన్లకు ఆహ్వానం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాజ్‌విహార్ టెర్మినల్ ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్ గా అభివృద్ధి చేయుటకు ఔత్సాహికులనుంచి ప్లాన్లు ఆహ్వానించామని కర్నూలు ప్రజా రవాణా అధికారి టి.శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రోడ్డు రవాణా సంస్థ, కర్నూలు జిల్లాలోని రాజ్ విహార్ టెర్మినల్ ని ఇంటిగ్రేటెడ్ బస్సు టెర్మినల్ గా అభివద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. ఈ క్రమంలో భాగంగా ఔత్సాహికులైన బిల్డర్లు, పారిశ్రామికవేత్తల నుండి తగు సూచనలు, సలహాలు , వారి కాన్సెప్ట్ ప్లాన్‌లను ఆహ్వానించామన్నారు. రాజ్ విహార్ టెర్మినల్ నిర్మాణానికి, నిర్వహణ, బదిలీ చేయుట అను విధానంలో ముందుకెళుతున్నామన్నారు. బస్సు కాంప్లెక్సుకు సంబంధించిన 1.93 ఎకరాల స్థలాన్ని సమీకృత బస్ టెర్మినల్ పేరుతో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానంలో చేపట్టేలా ప్రైవేటు సంస్థలు, వ్యక్తులకు ఇస్తామన్నారు. దీనికి సంబంధించిన ఆకృతులు, నిర్మాణ పనులు, బడ్జెట్, నిర్వహణ, బదిలీ అంశాలపై ఆసక్తి ఉన్న వ్యక్తుల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈక్రమంలో ఆర్టీసీ స్థలం కేటాయించనుండగా గుత్తేదారు మొత్తం పనులు చేపట్టాలని, దీనికి ప్రతిఫలంగా నిర్మాణ భవనాలను లీజుకు ఇచ్చేలా ప్రతిపాదన చేయనున్నామన్నారు. కింది అంతస్తులో 10 ప్లాట్ ఫారంల వరకు నిర్మించాలన్నారు. కింద పాక్షికంగా మొత్తం బస్టాండ్‌కు వినియోగించనుండగా, పై అంతస్తులు వివిధ రకాల వాణిజ్య అవసరాలకు గుత్తేదారు వినియోగించుకోవచ్చాన్నారు. ఔత్సాహికులు పూర్తి వివరాలను, విధి, విధానాలను www.apsrtc.ap.gov.in వెబ్ సైట్ నుండి ఏప్రెల్ 10 లోగా డౌన్ లోడ్ చేసుకొనవచ్చున్నారు. పూర్తి చేసిన ప్రతిపాదనలను చీఫ్ మేనేజరు (కమర్షియల్), ఆర్టీసి హౌస్, విజయవాడ వారికి ఏప్రెల్ 10న సాయంత్రం 05.00 గంటలలోగా పంపాలన్నారు. లేదా ctmm-cap@gmal.com మెయిల్‌కు పంపవచ్చున్నారు. ఈ విషయంలో ఏ నిర్ణయం తీసుకొనుటకైనా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రోడ్డు రవాణా సంస్థకు పూర్తి అధికారం ఉంటుందన్నారు. ఇతర వివరాల కోసం కింది నంబర్లను సంప్రదించాలన్నారు 9959222746, 9959224533, 9959224535.

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి- సి బెళగల్

సి బెళగల్ లో ఎంపిడిఒ శకుంతల శనివారం ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. పుర వీధుల్లో తిరుగుతూ పోలింగ్ కేంద్రాలలో ఓటును ఎలా వినియయోగించుకోవాలో ప్రజలకు సూచించారు. ఎన్నికల కోడ్ సందర్భంగా ఎవరైనా అనుమతి లేకుండా ఫ్లెక్సీలు కట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

మోడల్ స్కూల్లో ప్రవేశాలకు గడువు పొడగింపు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని మోడల్ స్కూళ్లలో ఆరో తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 6 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా దరఖాస్తు చేసుకునే విద్యార్థులు వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయిస్తున్న సెట్కూరు సిఇఒ రమణ

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

స్వీప్ కార్యక్రమంలో భాగంగా, 137-కర్నూలు రిటర్నింగ్ అధికారి, కమిషనరు ఎ.భార్గవ్ తేజ అదేశాల మేరకు, శనివారం కెవిఆర్ డిగ్రీ కాలేజ్, , నరసింహారెడ్డినగరు, బంగారు పేట, స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వీప్ జిల్లా అధికారి, సెట్‌కూరు సిఇఒ రమణ పాల్గొని మాట్లాడారు. ప్రతి మానవునికి రాజ్యాంగం ఇచ్చిన హక్కు అయిన ఓటును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిబ్బంది ఆర్‌పిలు, సిఒలు పాల్గొన్నారు.

ఓటరు వివరాలు తీసుకురావాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఎన్నికల విధులు నిర్వహించనున్న పిఒలు ఎపిఒలు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం 12, డ్యూటీ ఆర్డర్ కాపీ జిరాక్స్, ఓటర్ల గుర్తింపు కార్డు, జిరాక్స్‌ను ఏప్రిల్ 1 వ తేది ఎంఆర్‌సి కన్వెన్షన్ హాల్లో శిక్షణకు వచ్చేటప్పుడు తీసుకొని రావాలని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. పిఓ, ఎ పిఒలు తప్పనిసరి గా వివరాలు తీసురవాలన్నారు.

రావుల నారాయణ స్థూపం వద్ద నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

రావుల నారాయణ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-పత్తికొండ

సిపిఎం కోసం రావుల నారాయణ చేసిన సేవలు మరవలేనివని సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి అన్నారు. శనివారం పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో రావుల నారాయణ 23వ వర్ధంతి సందర్భంగా సిపిఎం నాయకులు ఆయన స్థూపానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. రంగారెడ్డి మాట్లాడుతూ హోసూరు గ్రామంలో సిపిఎం ఏర్పడడానికి ఆయన చేసిన సేవలు మరవలేనివని అన్నారు. నిరుపేద ప్రజల కోసం ప్రభుత్వ అధికారులతో గొడవలపడి జైలులో జీవితం అనుభవించి పేద ప్రజలకు ఇల్లు పట్టాలు పంపిణీ చేసిన ఘనత సిపిఎంకు దక్కిందని అన్నారు. నిత్యం ప్రజల కోసం అందుబాటులో ఉంటూ వారికి సేవలు చేస్తూ ఉండేవారని అన్నారు. సిపిఎం నాయకులు దస్తగిరి, వెంకటేశ్వర్‌రెడ్డి, గంగన్న, పుచ్చకాయల మాడ కాశి రాజశేఖర్, రావుల రామాంజనేయులు, గిత్తరి రమేష్, సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు..

వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

ఉరుకుందలో వేలం పాటలు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో శనివారం డిప్యూటీ కమిషనర్ హెచ్‌జి.వెంకటేష్ ఆధ్వర్యంలో శనివారం వేలం పాటలు నిర్వహించారు. దేవస్థానానికి విద్యుత్ సామగ్రి, ముద్రణ సామగ్రి, పూలు, వంట చెరకు, వస్త్రాల సరఫరా కోసం, భక్తుల సెల్ ఫోన్లు, లగేజ్ బ్యాగులు జాగ్రత్త పరచడానికి, దేవాలయ భూమి కౌలుకు, ఆన్‌లైన్, షీల్డ్ బహిరంగ టెండర్లు ఆహ్వానించారు. ఆదోని దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో టెండర్ బాక్స్ తీశారు. విద్యుత్ సామగ్రి సరఫరాకు ఇద్దరు, ముద్రణకు ఇద్దరూ షీల్డ్ టెండర్లు వేశారు. ఇందులో మార్కెట్ ధరలకు లోబడి ఉన్న వాటిని పరిశీలించి త్వరలో ప్రకటిస్తామని అధికారులు తెలిపారు. సెల్ ఫోన్లు, బ్యాగులు జాగ్రత్త పరచడానికి ముగ్గురు షీల్డ్ టెండర్ వేయగా ఇందులో శోభ రూ.5.51 లక్షలకు పాటను దక్కించుకున్నారు. మిగిలిన వాటికి దేవదాయ శాఖ ఆదేశాలకు అనుగుణంగా డాక్యుమెంట్లు సమర్పించకపోవడంతో, కొన్ని సింగల్ టెండర్ కావడంతో వాటిని రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. త్వరలో వాటిని టెండర్ ప్రకటన ద్వారా పిలుస్తామన్నారు. పర్యవేక్షకులు మల్లికార్జున, రామ్మోహన్, సీనియర్ అసిస్టెంట్లు కిరణ్, కుమార్, వీరేష్ పాల్గొన్నారు.

అధిష్టానం టికెట్ కేటాయించింది

- ఆశీర్వదించండి : వీరభద్ర గౌడ్

ప్రజాశక్తి - హోళగుంద

వీరభద్రగౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

టిడిపి అధిష్టానం ఆలూరు టికెట్ కేటాయించిందని, తనను ఆశీర్వదించాలని టిడిపి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్రగౌడ్ కోరారు. శనివారం ఎల్లార్తి షేక్షావలీ, షాషావలి, బొమ్మ గుండనహళ్లి రామమ్మ దేవతను, హోళగుంద సిద్ధేశ్వర, సాయి బన్న దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక రైస్ మిల్లులో ఆయనకు టిడిపి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో అందరి సహకారంతో ముందుకెళ్తామని తెలిపారు. 2014 ఎన్నికల్లో స్వల్ప మెజారిటీతో ఓడిపోయానని చెప్పారు.

నిబంధనలు ఉల్లంఘించే

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

- డిఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో నిబంధనలను ఉల్లంఘించి ముందస్తు అడ్మిషన్లు నిర్వహించే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ధణాపురం ఉదయ్ డిమాండ్ చేశారు. శనివారం ఆదోని ఆర్ట్స్ కళాశాల లైబ్రరీ వద్ద సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న నారాయణ, చైతన్య, భాష్యం విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్న స్కూల్ ముందు ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు మహేష్, అరవింద్, విక్రమ్, హనుమేష్, రమణ పాల్గొన్నారు.

కోర్టుల్లోని సమస్యలను పరిష్కరించాలి

- బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుందర్‌సింగ్

ప్రజాశక్తి - ఆదోని

సమస్యలు విన్నవిస్తున్న ఆదోని న్యాయవాదులు

ఆదోనిలోని జూనియర్, సీనియర్ సివిల్ కోర్టులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆదోని బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్‌కె.సుందర్ సింగ్ కోరారు. శనివారం కర్నూలు జిల్లా పోర్ట్ పోలియో న్యాయమూర్తి సురేష్ రెడ్డి, జిల్లా జడ్జి శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుందర్ సింగ్ మాట్లాడారు. గత 8 నెలల నుంచి జూనియర్, సివిల్ జడ్జి, సీనియర్ సివిల్ జడ్జి ఖాళీలు ఉండడంతో కేసులు పరిష్కారం కాక ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. వెంటనే ఆ పోస్టులను భర్తీ చేయాలని, కాపీ సెక్షన్‌లో కొత్త జిరాక్స్ మిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. వైస్ ప్రెసిడెంట్ ఎం.జనార్ధన్, కార్యదర్శి మల్లికార్జున, కోశాధికారి లతీఫ్ అహ్మద్, సీనియర్ న్యాయవాదులు విశ్వనాథరెడ్డి, వైఆర్.మల్లికార్జున, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ మట్టి రోడ్లు..?

- రోడ్డు లేక ప్రజల ఇబ్బందులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణ శివారు ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. పాలకులు మారినా తమ జీవితాలు మారడం లేదని శివారు ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని విజయ భాస్కర్ రెడ్డి నగర్, భీమ్ రెడ్డి నగర్, అమరావతి నగర్ ఎక్స్‌టెన్షన్, క్రాంతి నగర్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతమైన రాజాసాబ్ నగర్, ఆర్‌టిసి కాలనీ, ప్రశాంత్ నగర్ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా వీధులన్నీ బురదమయం కావడంతో అడుగు తీసి వేయలేక రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం చేపడతామని అధికారులు చెబుతున్నా కార్యరూపం దాల్చడం లేదు.

కాలువలు తవ్వారు.. రోడ్డు మరిచారు

పట్టణంలోని క్రాంతినగర్ ఎక్స్‌టెన్షన్ రాజాసాబ్ నగర్‌లో రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం కోసం రూ.20 లక్షలు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ మాత్రం కాలువలు తవ్వి రోడ్లు వేయకపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలపై కల్వర్టులు నిర్మించడం వల్ల వాటిని ఎక్కలేక, దాటలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్డు వేయాలని అధికారులను కోరుతున్నా కనీసం కాలనీ వైపు కూడా కన్నెత్తి చూడడం లేదని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు నిర్మిస్తే సౌకర్యంగా ఉంటుందని కోరుతున్నారు.

'గడపగడపకు' నిధులు ఏమయ్యాయి..?

'గడపగడపకు'లో ఆయా ప్రాంతాల అభివద్ధికి ఒక్కో వార్డుకు రూ.20 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు అప్పట్లో అధికారులు తెలిపారు. పట్టణంలో 42 వార్డుల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం' ముగిసింది. ఒక్కో వార్డుకు రూ.20 లక్షల చొప్పున సుమారు రూ.కోటి వ్యయంతో పనులు చేపట్టేందుకు అధికారులు ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశారు. కొన్ని ప్రాంతాల్లో పనులు జరిగినా అక్కడక్కడ నిధుల్లేకపోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అధికారులు అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసి శివారు ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పురవాసులు కోరుతున్నారు.

రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు

రోడ్లు వేయాలి

- రవి, స్థానికుడు

క్రాంతి నగర్ ఎక్స్‌టెన్షన్ అయిన రాజాసాబ్ నగర్‌లో కాలువలు ఏర్పాటు చేసి అలానే వదిలేశారు. రోడ్డు లేకపోవడం వల్ల కాలువలు నిర్మించినా ప్రయోజనం లేకుండాపోయింది. చిన్నపాటి వర్షం వచ్చినా నీరు అలాగే నిలిచి ఆ ప్రాంతమంతా బురదమయంగా మారుతోంది. రోడ్లు నిర్మించాలని అధికారులను కోరినా స్పందన లేదు. కాలువలు తవ్విన కాంట్రాక్టర్‌ను అడిగితే నిధుల్లేవని, బిల్లులు రాకపోతే తానేమి చేయాలని చెబుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

పనులు ప్రారంభించేలా చర్యలు

- వెంకట చలపతి రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్, ఆదోని

పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం కోసం సుమారు రూ.కోటికి ప్రతిపాదనలు పంపాం. చేసిన పనుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచడం వల్ల బిల్లులు పడుతున్నాయి. అసంపూర్తిగా ఉన్న పనులను గుర్తించాం. అవసరాలను బట్టి పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించాం. త్వరలో పనులు జరిగేలా చర్యలు తీసుకుంటాం.

శ్రీమఠం ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

- శ్రీమఠం మేనేజర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహించే మెగా ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో శ్రీమఠం, ఐడిఎఆర్‌సి అంతర్జాతీయ సంస్థ సంయుక్తంగా, శ్రీమఠం నిర్వహణలో ఉన్న శ్రీసుజయీంద్ర ఆరోగ్యలో ఈ నెల 31న మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రం అరక్కోణానికి చెందిన రాఘవేంద్ర ట్రస్టు నేతృత్వంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ గిరిజా గణేష్, జివి.సురేష్, డాక్టర్ శంకర్, ఆర్థోపెడిక్, డయాబెటిస్, కార్డియాలజీ, డెర్మటాలజీ, న్యూరాలజీలో సిద్ధ హస్తులైన వైద్య బృందం, అత్యాధునిక యంత్రాలతో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని భక్తులు, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టిప్పర్ లారీ అగ్నికి ఆహుతి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని శివారులోని బైపాస్ రోడ్డు పనులు జరుగుతుండగా శనివారం అశోక్ లేలాండ్ టిప్పర్ మట్టిని తరలిస్తుండగా ప్రమాదశాత్తు హెవీ లైన్ విద్యుత్ తీగలు తాకి మంటలు వ్యాపించాయని స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

వైసిపిలో చేరిన రాఘవేంద్ర ఆచారి

కండువా వేస్తున్న జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్దహరివణం గ్రామ మాజీ సర్పంచి, గ్రామ పెద్ద రాఘవేంద్ర ఆచారి వైసిపిలో చేరారు. ఎమ్మిగనూరులో నిర్వహించిన 'మేమంతా సిద్ధం' సభలో పార్టీలో చేరినట్లు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీలో చేరినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. ఆయన కాంగ్రెస్‌లో ఎమ్మెల్యేగా కొనసాగుతున్నప్పుడు సర్పంచిగా ఎన్నికై గ్రామం కోసం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఇక మీదట కూడా ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు ఏ బాధ్యతను అప్పగించినా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి - మంత్రాలయం

స్వాగతం పలుకుతున్న శ్రీమఠం సిబ్బంది

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామిని కర్ణాటక హైకోర్టు జడ్జి ఎవి.రవీంద్ర బాబు శనివారం దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి మంత్రాలయం చేరుకున్న ఆయన పద్మనాభ తీర్థ అతిథి గృహంలో బస చేశారు. శనివారం ఉదయం దర్శనార్థం ఆలయం చేరుకున్న ఆయనకు శ్రీమఠం ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతిఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహమూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ఆయనకు మెమొంటో అందజేశారు.

వ్యవసాయ కూలీల ఆటో బోల్తా

- ఒకరు మృతి, ఇద్దరి పరిస్థితి విషమం

- 20 మందికి గాయాలు

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు మండలంలోని గుంతకల్ రోడ్డు మార్గంలో హత్తిబెళగల్ బస్టాండ్ సమీపంలో శనివారం వ్యవసాయ కూలీల టాటా ఏస్ ట్రాలీ ఆటో బోల్తా పడింది. ఈ సంఘటనలో ఒకరు మృతి చెందగా, 20 మందికి గాయాలయ్యాయి. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల వివరాల మేరకు... హులేబీడు గ్రామానికి చెందిన 41 మంది వ్యవసాయ కూలీలు టాటా ఏస్ ట్రాలీ ఆటోలో చిప్పగిరి మండలంలోని ఓ గ్రామంలో మిరప పంటను తెంపేందుకు వెళ్లారు. తిరిగి తమ గ్రామానికి వస్తుండగా హత్తిబెళగల్ బస్టాండ్ సమీపంలో ఆటో వెనుక టైర్ పగిలి బోల్తా పడింది. స్థానికులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో, ఇతర వాహనాల్లో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మస్తానమ్మ మృతి చెందారు. 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి ఐదుగురిని ఆదోనికి తరలించారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో, ఆస్పత్రిలో క్షతగాత్రులు, బంధువులు ఆర్తనాదాలతో కిక్కిరిసింది.

ఘటన స్థలంలో ఉన్న క్షతగాత్రులు

వైభవంగా శ్రీసుయతీంద్ర తీర్థుల స్వర్ణ రథోత్సవం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠం పూర్వపు పీఠాధిపతులు శ్రీసుయతీంద్ర తీర్థుల స్వర్ణ రథోత్సవం వైభవంగా సాగింది. శనివారం శ్రీసుయతీంద్ర తీర్థుల మధ్యారాధన సందర్భంగా శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో శ్రీసుయతీంద్ర తీర్థుల చిత్రపటాన్ని స్వర్ణ రథోత్సవంపై ఉంచి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య శ్రీమఠం ప్రాకారంలో వైభవంగా ఊరేగించారు. అంతకుముందు శ్రీసుయతీంద్ర తీర్థుల బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చన, మహా పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని వెండి కవచాలతో, పుష్ప హారాలతో అలంకరించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్రుని ఆరాధ్య దైవమైన మూల రాములకు విశిష్ట పూజలు నిర్వహించారు. రాఘవేంద్రుని బృందావనాన్ని, శ్రీసుయతీంద్ర తీర్థుల బృందావనాన్ని దర్శించుకున్నారు.

స్వర్ణమంత్రాలయ నిర్మాతగా శ్రీసుయతీంద్ర తీర్థులు

- పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు

శ్రీమఠం పూర్వపు పీఠాధిపతులు, తమ గురువు శ్రీసుయతీంద్ర తీర్థులు స్వర్ణ మంత్రాలయ నిర్మాతగా ప్రఖ్యాతి చెందారని పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు కొనియాడారు. ఊయల మండపంపై ఏర్పాటు చేసిన వేదికపై శ్రీసుయతీంద్ర తీర్థుల చిత్రపటానికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తుంగభద్ర నది వరదకు శ్రీమఠంతో పాటు మంచాల గ్రామం నష్టపోయిందని తెలిపారు. అలాంటి సమయంలో శ్రీసుయతీంద్ర తీర్థులు ఇటు శ్రీమఠాన్ని, అటు గ్రామాన్ని అభివృద్ధి చేశారని తెలిపారు. రూపురేఖలు మార్చి స్వర్ణ మంత్రాలయ నిర్మాతగా కీర్తి సాధించారని కొనియాడారు. ఆయన అడుగు జాడల్లో పయనించి శ్రీమఠం అభివృద్ధికి కృషి చేస్తున్నానని చెప్పారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందించిన వారికి శ్రీసుయతీంద్ర తీర్థుల అవార్డులను ప్రదానం చేశారు. ఈ ఆరాధన మహోత్సవాల సందర్భంగా పండితుల ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రథోత్సవంలో పాల్గొన్న పీఠాధిపతులు

క్రైస్తవులు ఐక్యతతో ముందుకు సాగాలి

- ఆదోని క్రైస్తవ సంఘాల పాస్టర్లు

ప్రజాశక్తి - ఆదోని

క్రైస్తవులంతా ఐక్యతతో ముందుకు సాగాలని ఆదోని క్రైస్తవ సంఘాల పాస్టర్లు రెవరెండ్ పాస్టర్ భాస్కర్ బాబు, బ్రదర్ బెనర్జీ రాజు, విక్టర్ పాల్ ఫిలిప్, పాస్టర్ సుజిత్ విలియమ్స్, రవిప్రకాష్ తెలిపారు. శనివారం క్రీస్తు పునరుద్ధాన దినం సందర్భంగా పట్టణంలో 'రన్ ఫర్ జీసస్' చేపట్టారు. ఆస్పరి బైపాస్‌లోని మహిమ ప్రార్థన మందిరం నుంచి సాగిన ర్యాలీకి క్రైస్తవులు భారీగా తరలివచ్చారు. అక్కడి నుంచి మండగిరి, కొత్త బస్టాండ్, వైఎంజి.సర్కిల్, భీమాస్ కూడలి, మున్సిపల్ మెయిన్ రోడ్డు మీదుగా విక్టోరియాపేట సిఎస్ఐ చర్చి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్రైస్తవులంతా ప్రపంచ శాంతి కోసం, దేశ, రాష్ట్ర అధినేతల కోసం ప్రార్థించాలని తెలిపారు. రన్ ఫర్ జీసస్ కన్వీనర్ జిజె.సునీల్ రాజ్ కుమార్, శాంత కుమార్, డేవిడ్, హోసన్న, ఆయా సంఘాల పాస్టర్లు ఆశీర్వాదం, శాంతన్న, జకరయ్య, శరత్ బాబు, బాలరాజు, జయపాల్, జాన్, రవి, రత్నకుమార్, విల్సన్, శ్రీకాంత్, అమృత ప్రసాద్, సంఘటి దేవదానం, థామస్, ప్రభు, జోసెఫ్, కిరణ్ రాజ్ పాల్గొన్నారు.

ఆదోనిలో భారీగా రన్ ఫర్ జీసస్ క్రైస్తవ ర్యాలీ

శ్రీశైలానికి కన్నడీగుల పాదయాత్ర

ప్రజాశక్తి - కౌతాళం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రసిద్ధి చెందిన శ్రీశైలం మల్లికార్జున స్వామి ఉగాది ఉత్సవాలకు కర్ణాటక భక్తులు కాలినడకన తరలి వెళ్తున్నారు. శనివారం మండలంలోని కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన కుంబాలనూర్ వద్ద కర్ణాటక ప్రాంతం నుంచి భక్తులు భారీ సంఖ్యలో ప్రవేశించారు. కర్ణాటకలోని బెల్గాం, బాగల్కోట్, హుబ్లీ, ధార్వాడ్, గంగావతి, సింధనూర్ తదితర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు పాదయాత్ర చేస్తూ శ్రీశైలం వైపు కొనసాగుతున్నారు. ఇందులో కాళ్లకు కట్టెలు కట్టుకొని సుమారు 500 కిలోమీటర్ల పైనే కాలినడకన వెళ్తున్న భక్తులు గ్రామాల్లో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నారు. మండుటెండల్లో కొనసాగుతున్న భక్తుల పాదయాత్రకు అక్కడక్కడ తాగునీటి వసతి గ్రామస్తులు కల్పించారు. రోజుకు 40 నుంచి 50 కిలోమీటర్ల వరకు కాలినడకతో చేరుకుంటున్నామని భక్తులు తెలిపారు. పగటిపూట ఎండలు ఎక్కువగా ఉండడంతో, అర్ధరాత్రి నుంచి పాదయాత్ర కొనసాగించి, మధ్యలో విశ్రాంతి తీసుకుని సాయంత్రం వేళలో యాత్రను కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.

పాదయాత్రగా వెళ్తున్న కన్నడ భక్తులు

కాంగ్రెస్ పట్టణాధ్యక్షులుగా సాయినాథ్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పిసిసి అధ్యక్షులు షర్మిల ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా అధ్యక్షులు బాబురావు సూచన మేరకు ఆదోని పట్టణ అధ్యక్షులుగా వై.సాయినాథ్‌ను నియమించినట్లు నాయకులు తెలిపారు. శనివారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు నీలకంఠప్ప మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో పని చేసే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు లభిస్తుందని తెలిపారు. అనంతరం పట్టణ అధ్యక్షులు సాయినాథ్ మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి పదవిని కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షులుగా రామన్న యాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ ఫరూక్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులుగా మాణిక్యరాజును ఎన్నుకున్నారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారుతి రావు, ఐఎన్‌టియుసి జయరాం, మద్దిలేటి, బండారీ తాయన్న పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

అంబేద్కర్ జయంత్యుత్సవ కమిటీ ఛైర్మన్‌గా మాల ఉసేని

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో ప్రతేడాది ఏప్రిల్ 14న అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ ఛైర్మన్‌గా మాల ఉసేనిని ఎన్నుకున్నారు. శనివారం అంబేద్కర్ జయంత్యుత్సవ కమిటీ కన్వీనర్ ఎస్.దేవసహాయం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. 2024 డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంత్యుత్సవ కమిటీ ఛైర్మన్‌గా మాల ఉసేని, కమిటీ సభ్యులుగా ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ డి.బాలయ్య, జి.ఆనంద్ చైతన్య, కదిరికోట ఆదెన్న, రుద్రాక్షల పెద్దయ్య, టీచర్ ఎరుకల కృష్ణ, సోగనూరు ఆనందరావు, ఎస్.రాజు, రుద్రాక్షల బజారి, రోజా ఆర్ట్స్ ఉసేని, కనకవీడు రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఏప్రిల్ 14న పట్టణంలోని పద్మశ్రీ మాచాని సోమప్ప మెమోరియల్ హాలులో అంబేద్కర్ జయంత్యుత్సవ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, దళిత నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు.

సామాజిక సేవే వెంకప్ప ఆశయం

- బాధితులకు కొండంత ఆసరా

- మృత్యువును జయించిన చిన్నారులు

ప్రజాశక్తి-ఆలూరు

సామాజిక సేవే జీవిత ఆశయంగా తెర్నేకల్ వెంకప్ప సేవలు అందిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. బాల్యంలో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని చదువు సాగించిన వెంకప్ప చదువులో రాణించి ఉన్నత ఉద్యోగం చేస్తూ రాజకీయంగా ప్రజలను చైతన్య పరుస్తూ, ఎంతోమంది బాధితులకు ఆసరాగా నిలుస్తున్నారు. తల్లి రంగమ్మ కూరగాయలు వ్యాపారం చేస్తూ ఎంతో కష్టపడి వెంకప్పను చదివించారు. ఆ చదువుకు సార్థకత చేకూర్చుతూ కష్టాల్లో ఉన్న ఎంతోమందికి ఆయన చేయూతనందిస్తున్నారు. దేవనకొండ మండలం తెర్నేకల్ గ్రామానికి చెందిన వెంకప్ప బెంగళూరులో సామ్ సంగ్ ఆర్‌అండ్‌డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ తన స్తోమతకు మించి సహాయాన్ని అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. మృత్యువు ముంగిటకు వెళ్లిన చిన్నారుల వైద్య ఖర్చుల నిమిత్తం తనతో పాటు తనకు తెలిసిన స్వచ్ఛంద సంస్థలు, స్నేహితుల సహకారంతో రూ.కోటికి పైగా సహాయం అందించారు. ఆయన ప్రజలకు అందించిన సేవలపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం...

చిన్నారి కాలేయ మార్పిడికి సాయం

పట్టణానికి చెందిన బద్రీనాథ్ టివి న్యూస్ ఛానల్ రిపోర్టర్‌గా పని చేస్తున్నారు. బద్రీనాథ్, పుష్పావతి దంపతుల కుమార్తె హారిక కాలేయ సమస్యతో అనారోగ్యం బారిన పడింది. నిరుపేద కుటుంబమైన బద్రీనాథ్ తన స్తోమతకు మించి ఖర్చు చేసినా జబ్బు నయం కాలేదు. కాలేయ మార్పిడి కోసం రూ.30 లక్షలు ఖర్చువుతుందని వైద్యులు చెప్పడంతో ఆపన్నహస్తం కోసం ఎదురు చూశారు. ఎంతో మందిని అర్థించిన సహాయం దొరకలేదు. చివరకు తెర్నేకల్ వెంకప్ప సహాయం అందించేందుకు ముందుకొచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన నవస్వప్న ఫౌండేషన్ సహకారంతో హైదరాబాదులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో 2020 సంవత్సరంలో రూ.30 లక్షలు వెచ్చించి చికిత్స చేయించారు. ప్రస్తుతం హారిక కోలుకొని తన చదువు కొనసాగిస్తోంది.

మృత్యువును జయించిన పవన్

జబ్బుతో మృత్యువు అంచుకు చేరిన చిన్నారి పవన్‌కు వెంకప్ప కొండంత అండగా నిలిచారు. ఆలూరు పట్టణానికి చెందిన రమేష్, నాగరాణి దంపతుల పెద్ద కుమారుడు పవన్ చిన్న వయస్సులో పెద్ద జబ్బు సోకి ఇబ్బంది పడ్డాడు. ఈ జబ్బు సోకిన చిన్నారికి రక్తం ఎక్కించినా ఎక్కువ రోజులు ఉండకపోవడంతో ఎంతో ఇబ్బందిగా మారింది. ఆస్పత్రిలో రక్తం ఎక్కించుకొని పది రోజుల వ్యవధిలో రక్తహీనతతో అనారోగ్యం బారినపడతాడు. ఈ వ్యాధిని నయం చేసుకునేందుకు దంపతులు ఇప్పటికే ఉన్న ఆస్తులు అమ్ముకొన్నారు. ఈ వ్యాధి నివారణకు రక్త మూలిగా మార్పిడి (బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్) చేసేందుకు రూ.40 లక్షలు దాకా ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. అంత డబ్బు వెచ్చించి ఖర్చు చేయించేందుకు ఆర్థిక స్తోమత లేక ఆశలు వదులుకున్న తరుణంలో వెంకప్ప వారికి అండగా నిలిచారు. 2022 సంవత్సరంలో బెంగళూరు కార్పొరేట్ ఆస్పత్రిలో రూ.30 లక్షలతో రక్త మూలిగా మార్పిడి చికిత్స చేయించారు. ప్రస్తుతం పవన్ ఎంతో ఆరోగ్యంగా ఉంటూ చదువుకుంటున్నాడు.

ఆపరేషన్ తర్వాత పవన్, వికాస్, బాధితులతో ఉన్న వెంకప్ప, డాక్టర్ రష్మి

వైద్య సేవలకు రూ.లక్షల్లో సాయం

ఆస్పరి మండలం చిన్నహోతూరు గ్రామానికి చెందిన మంగమ్మ అనే నిరుపేద మహిళకు అప్లాస్టిక్ ఎనిమియా వ్యాధి సోకింది. జబ్బు నయం చేసుకునేందుకు రూ.6 లక్షలు దాకా ఖర్చు చేశారు. అప్పటికీ నయం కాకపోవడంతో ఆపన్న హస్తం కోసం ఎదురు చూశారు. వెంకప్ప బెంగళూరులోని కార్పొరేట్ ఆస్పత్రిలో రూ.25 లక్షలు దాకా సహాయం చేసి ఆమెకు రక్త మూలిగా మార్పిడి చికిత్స చేయించారు. ఆమె కోలుకుని ఆరోగ్యంగా ఉన్నారు. అలాగే సి.బెళగల్ గ్రామానికి చెందిన ఉప్పర వెంకటేష్, పద్మావతి దంపతుల కుమారుడు రాజేష్ కూడా అప్లాస్టిక్ ఎనిమియా జబ్బుతో బాధపడగా ఆ విద్యార్థికి కూడా దాదాపు రూ.25 లక్షలు వెచ్చించి చికిత్స చేయించారు.

ఎంబిబిఎస్ చదువుతున్న లాలప్పతో వెంకప్ప

నిరుపేద ఎంబిబిఎస్ విద్యార్థికి చేయూత

నిరుపేద ఎంబిబిఎస్ విద్యార్థికి వెంకప్ప చేయూతనందించారు. దేవనకొండ గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి లాలప్పకు ఎంబిబిఎస్ సీటు రాగా ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఇబ్బంది పడ్డారు. ఈ తరుణంలో చదువుకునేందుకు ఏడాదికి రూ.75 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నారు.

కరోనా కాలంలో సహాయం

కరోనా సమయంలో నగరాల్లో చిక్కుకుపోయిన కూలీలు, ప్రజలను వెంకప్ప తన స్వంత ఖర్చులతో స్వగ్రామాలకు తరలించారు. ముంబయి, గోవా, గుంటూరు తదితర ప్రాంతాల్లో ఉన్న వారికి నిత్యావసర సరుకులు అందజేయడంతో పాటు వారిని కర్నూలు జిల్లాకు తీసుకొచ్చారు. ఆలూరు నియోజకవర్గంలోని గ్రామాల్లో నిరుపేదలకు నిత్యావసర వస్తువులను అందించారు.

నిరుపేద బాధితులను ఆదుకోవడంలోనే సంతృప్తి

- తెర్నేకల్ వెంకప్ప

పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆర్థిక సమానత్వం లేక నిరుపేద బతుకులు దయనీయంగా మారుతున్నాయి. నిరుపేదలకు ఇప్పటికీ సరైన వైద్య సేవలు, చదువులు అందడం లేదు. వైద్యం, విద్య ప్రతిఒక్కరీ హక్కుగా భావించాలి. ఎంతో మంది నిరుపేదలు అనారోగ్యం బారిన పడి జబ్బు నయం కాక ఇబ్బందులు పడుతున్న సంఘటనలు తన దృష్టికి వచ్చినప్పుడు ఎంతో బాధ వేస్తుంది. నిరుపేదల్లో ఎంతో మంది ప్రతిభాంతులై విద్యార్థులు ఆర్థిక స్తోమత లేక చదువుకు దూరమవుతున్నారు. ఇలాంటి సమస్యలు బాధితులు తన దృష్టికి తెస్తే ఆర్థిక సహాయం అందిస్తున్నాను. పేదలను ఆదుకోవడంలోనే సంతృప్తి ఉంది.

IN THE COURT OF THE HON'BLE II ADDL.DISTRICT JUDGE,KURNOOL : ADONI

I.A.No: 472/2023 IN O.S.No.18/2023

Mone Bhagyamma ... Petitioner/Plaintiff

Vs.

Boda Sreekanth ... Respondent/Defendant

NOTICE TO THE RESPONDENT/DEFENDANT

To
Respondent/Defendant:
Boda Sreekanth S/o Chinna Sunkanna,
Hindu, Aged about 38 Years,
D.No. 5/1796-A, Lakshmipeta,
Yemmiganur Town, Kurnool Dist.

Whereas the above named Plaintiff filed suit for Specific Performance against the Defendant. Hence you are hereby required to appear before this court on 01.05.2024 at 10.30 AM in person or through an advocate and answer the said suit, otherwise the matter will be decided exparty.

(By Court Order)

M.K.GURURAJA RAO
Advocate,
Yemmiganur/Adoni.

ప్రజాశక్తి
www.prajasakti.com

టిడిపిలో చేరిన మండ్ల శివశంకర్ రెడ్డి

నాయకులతో మాజీ ఎమ్మెల్యే బుడ్డా

ప్రజాశక్తి - వెలుగోడు

వెలుగోడు పట్టణ మాజీ సింగిల్ విండో చైర్మన్ మండ్ల శివశంకర్ రెడ్డి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. శనివారం మాజీ సింగిల్ విండో చైర్మన్ మండ్ల శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో మండ్ల ప్రవీణ్ కుమార్ రెడ్డి, రఘుస్వామి రెడ్డి, పుల్లం రాజు, దర్గా బాదుల సాహెబ్, శ్రీనివాసులు, ఉప్పరి రమణ తదితరులతో పాటు 100 కుటుంబాలు శనివారం మాజీ ఎమ్మెల్యే, శ్రీశైలం అసెంబ్లీ టిడిపి అభ్యర్థి బుడ్డా రాజశేఖర రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బుడ్డా కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. తన రాజకీయ జీవితం ప్రారంభమైనప్పటి నుంచి కాంగ్రెస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలలో ఉంటూ వచ్చానని, నేటి రాజకీయ పరిస్థితులు, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి నియంతత్వ పోకడల నచ్చక, నియోజకవర్గ అభివద్దే ధ్యేయంగా తొలిసారి తెలుగుదేశం పార్టీలో చేరానని మండ్ల శివ శంకర్ రెడ్డి అన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి బుడ్డా రాజశేఖర రెడ్డి అఖండ మెజారిటీ తో గెలిపించుకుని వలస నేతలకు బుద్ధి చెప్తామని ధీమా వ్యక్తం చేశారు.

మహిళలతో మాజీ ఎమ్మెల్యే బుడ్డా

టిడిపిలో చేరిన గిరిజన కుటుంబాలు

తెలుగుదేశం పార్టీలోకి వలసల పరంపర కొనసాగుతోంది. శనివారం వెలుగోడు పట్టణానికి చెందిన బీరమ్మ, నాగ సూరమ్మ, నాగమ్మ, బాయమ్మ, అంకమ్మ తదితరులతో పాటు 20 గిరిజన కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే, శ్రీశైలం అసెంబ్లీ టిడిపి అభ్యర్థి బుడ్డా రాజశేఖర రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు.

ఎవి శ్రీనివాసులు సేవలు అమోఘం..

- ఎవి సూపర్వైజర్ పదవీ విరమణ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఏవి శ్రీనివాసులు సమాచార శాఖకు చేసిన సేవలు మరువలేని విని అమోఘమని డిపిఆర్ఓ మల్లికార్జునయ్య తెలిపారు. సమాచార, పౌర సంబంధాల శాఖలో వివిధ హోదాల్లో మూడు దశాబ్దాలకు పైగా పనిచేసి నంద్యాల డిఐపిఆర్ఓ కార్యాలయంలో పదవీ విరమణ చేస్తున్న ఎ. వి. సూపర్వైజర్ బి. శ్రీనివాసులుకు కార్యాలయ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం కలెక్టరేట్ లోని సమాచారం పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో వీడ్కోలు సభ నిర్వహించి కార్యాలయం సిబ్బంది ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. 1991 సంవత్సరంలో పబ్లిసిటీ అసిస్టెంట్ గా విధుల్లో చేరి వివిధ హోదాల్లో పనిచేసి ప్రతి ఒక్కరితో సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకుని అందరి మన్ననలు పొందారని డిపిఆర్ఓ మల్లికార్జునయ్య తెలిపారు. పనిచేసిన ప్రతి ప్రదేశంలో వివాదరహితుడిగా ఉండడమే కాకుండా అందరి అభిమానాలను చూరగొన్నాడు. అనంతరం కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వరప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ రామ్ చరణ్, టైపిస్టులు సందీప్ కుమార్, పుల్లయ్య, డ్రైవర్ త్రినాథ్, ఇతర కార్యాలయపు సిబ్బంది ఏవీ సూపర్వైజర్ ను ఆత్మీయతతో శాలువా కప్పి సన్మానించారు.

శ్రీనివాసులను సన్మానిస్తున్న డిపిఆర్ఓ సిబ్బంది

తెలుగుదేశం అధికారంలోకి వస్తేనే బిసిలకు రాజ్యాధికారం

- నంద్యాల పార్లమెంట్ ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి

ప్రజాశక్తి - నందికొట్కూరు

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే బీసీలకు రాజ్యాధికారం వస్తుందని నంద్యాల పార్లమెంట్ ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో నంద్యాల పార్లమెంట్ ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి , టీడీపీ అభ్యర్థి గిత్త జయసూర్యల ఆధ్వర్యంలో జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో అనేక రకాల హామీలు ఇచ్చి ఏ ఒక్కటి పూర్తి చేయలేని దుర్మార్గపు పాలన ఈ వైసిపి ప్రభుత్వానిదన్నారు. చెత్తపై కూడా పన్ను విధించిన ఘనత ఈ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని, తెలుగుదేశం ప్రభుత్వంలో బిసిలకు అనేకరకాల సంక్షేమ పథకాలు అందించి వారి అభివృద్ధికి తోడ్పడిన నాయకులు నారా చంద్రబాబు నాయుడే అన్నారు. రాష్ట్రంలో బిసిలకు రాజ్యాధికారం అందించిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని రాబోయే ఎన్నికలలో టిడిపి ప్రభుత్వం ఏర్పడ్డాక బిసిలకు ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేస్తామని టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ హామీ ఇవ్వడం జరిగిందన్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలో వైకాపా ప్రభుత్వం లో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ఓబుల్ రెడ్డి, చేపల మహేష్, రంగస్వామి, కురువ శివన్న, హరీష్ రెడ్డి, నాగ లక్షమయ్యా, బాల చంద్రుడు, మద్దిలేటి, బ్రహ్మానంద రెడ్డి,మోహన్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దేవస్థాన నిర్మాణంలో పూజలు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల సుంకులమ్మ వీధిలో ఉన్న శ్రీ సుంకులా పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ సుంకుల పరమేశ్వరి దేవాలయానికి అనుబంధంగా నిర్మించిన నూతన పూజ మండప భవనంలో శని, ఆదివారాలలో పూజలు నిర్వహించారు. రక్ష యజ్ఞ హోమం, నవగ్రహ హోమం తదితర పూజలను రెండు రోజులలో పురోహితుల బృందం నిర్వహిస్తారని ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ గుర్రాల రవి కృష్ణ, కార్యదర్శి చిమ్మా నాగన్న, ఉపాధ్యక్షులు ఎచ్చెర్ల నరసింహారావు తెలియజేశారు.

వైసిపిని వీడి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రుద్రవరం మండలం ముత్తలూరు గ్రామానికి చెందిన పలువురు వైకాపాను వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. శనివారం అఖిలప్రియ స్వగృహంలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, భార్గవరామ్‌ల సమక్షంలో నంద్యాల పద్మనాభరెడ్డి, పాపిరెడ్డి గారి బాల రామలింగా రెడ్డి, లింగారెడ్డి, శివరామలింగారెడ్డి తో పాటు మరికొన్ని కుటుంబాలు వైకాపాను వీడి టిడిపిలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి మాజీ మంత్రి భూమా అఖిలప్రియ దంపతులు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రుద్రవరం మండల నాయకులు పోల గురుమూర్తి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భూమా అఖిలప్రియ సమక్షంలో టిడిపిలో చేరిన నేతలు

.కొండాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న భూమా జగద్విఖ్యాతిరెడ్డి

చంద్రబాబుతోనే అభివృద్ధి : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సంక్షేమం అభివృద్ధి సాధ్యమని టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి అన్నారు. దొర్నిపాడు మండలం కొండాపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన బాబు సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి తిరిగి కరపత్రం పంచుతూ ప్రజలకు పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్ధి సత్యం, కొత్తపల్లి సురేంద్ర, అనంతరామ సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి - పాములపాడు

ఎన్నికల నియమాలని ఉల్లంఘిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని ఆత్మకూరు రూరల్ సిఐ నాగభూషణ్ యాదవ్, పాములపాడు ఎస్సై జి అశోక్‌లు హెచ్చరించారు. శనివారం సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండ లంలోని మిట్టకందాల, కృష్ణ నగర్, మద్దూరు, వానాల గ్రామాలలో బిఎస్ఎఫ్ బలగాలతో పోలీస్ కావత్ నిర్వహించారు. గ్రామాలలో నియమాళిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ఇలాంటి అల్లర్లకు పాల్పడిన కేసులు బనాయించడం జరుగుతుందన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు: శనివారం కర్నూల్ టు అమరావతి ప్రధాన రహదారిపై ఆత్మకూరు రూరల్ సీఐ నాగభూషణ యాదవ్ పాములపాడు ఎస్సై జి అశోక్ లు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అనుకూలంగా వాహనదారులు నడుచుకోవాలన్నారు. తమ ఖర్చులకు సరిపడంత డబ్బులు మాత్రమే తీసుకెళ్లాలని, అధిక డబ్బులు తీసుకెళ్లినట్లయితే సంబంధిత రుజువులను చూపించాల్సి ఉంటుందన్నారు.

ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీలు చేస్తున్న సిఐ

బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటరాముడుకు సన్మానం

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా 29ఓట్ల మెజారిటీ తో నూతనంగా ఎన్నికైన సీనియర్ అడ్వకేట్ జే వెంకట్రాముడికి ఆయన కార్యాలయంలో మండ్లెం మాజీ సర్పంచ్ ఎట్క వి రమణ, సిపిఐ జిల్లా నాయకులు ఎం.రమేష్ బాబు, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎల్.స్వాములు, దళిత సంఘం నాయకుల జి.ప్రతాప్ , హుసేన్ తదితరులు సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో అన్ని రకాల న్యాయ పరమైన అంశాల పట్ల పూర్తి అవగాహన కలిగి 23 సంవత్సరాలుగా సేవలందిస్తూన్న జే.వెంకటరాముడికి నూతన బార్ అసోసియషన్ ప్రెసిడెంట్గా అవకాశం కల్పించడం అభినందించదగ్గ విషయమన్నారు. ప్రజలకు మరింత చేరువగా ఉండి లాయర్ల సమస్యల పట్ల గలం వినిపించి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని వారు అన్నారు.

ఉద్యోగ విరమణ సహజం: సిడిపిఒ

ప్రజాశక్తి-పత్తికొండ

ప్రభుత్వ ఉద్యోగాల్లో పదవీ విరమణ సహజమని పత్తికొండ సిడిపిఒ సావిత్రి అన్నారు. శనివారం పత్తికొండ పట్టణం ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఒ పదవీ విరమణ సందర్భంగా పత్తికొండ తుగ్గలి మద్దికేర సెక్టార్ ప్రాజెక్ట్ సూపర్వైజర్లు పత్తికొండ సిడిపిఒ సావిత్రికి శాలువా వేసి పూలమాలవేసి ఘనంగా సత్కరించారు. ఈ సూపర్వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ పత్తికొండలో అంగన్వాడి టీచర్లకు ఆయాలకు అందుబాటులో ఉంటూ అనేక సేవలు అందించారని కొనియాడారు. కుటుంబ సభ్యులకు శేష జీవితం గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు , నాగేశ్వరమ్మ సౌభాగ్య లక్ష్మి సుమిత్రమ్మ అంబికా త్రివేణి వినోద్ కుమార్ వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు..

'మేముసిద్ధం బస్సు యాత్ర విజయవంతం'

హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ సతీష్ కృతజ్ఞతలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైం

మేము సిద్ధం బస్సు యాత్ర విజయవంతమైందని, అందుకు సహకరించిన ప్రజలకు, అభిమానులకు , కార్యకర్తలకు కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం కోడుమూరు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో వారు మాట్లాడారు. శుక్రవారం జరిగిన సిఎం జగన్మోహన్ రెడ్డి చేపట్టిన మేము సిద్ధం బస్సు యాత్రకు వేలాదిగా ప్రజలు తరలివచ్చి, తమ అభిమానాన్ని చాటుతూ, కార్యక్రమాన్ని విజయవంతం చేశారని తెలిపారు. మళ్లీ సీఎం గా జగన్మోహన్ రెడ్డి గారిని గెలిపిస్తామన్నారని, ఎంపి అభ్యర్థి బివై రామయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్‌కు ఓట్లు వేసి గెలిపిస్తామని తెలిపినందుకు ప్రజలందరికి ధన్యవాదాలు తెలిపారు.

పోలింగ్ బూతుల్లో విద్యుత్ సౌకర్యం

ప్రజాశక్తి-మద్దికేర

సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా పోలింగ్ బూతులలో విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని మండల విద్యుత్ అధికారి రఫీఖాన్ తెలిపారు. మండల పరిధిలోని యడవలిలో 38వ పోలింగ్ బూత్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో అన్ని గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్నామని అన్నారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ బూతులలో అధికారులకు, ప్రజలకు, అందుబాటులో ఉండి విద్యుత్, సమస్య లేకుండా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ వనూరప్ప విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తమ్మారెడ్డి కుమారులకు సిఎం నివాళులు

ప్రతాపరెడ్డి కుటుంబానికి అండగా ఉంటా.. సీఎం జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి తుగ్గలి

పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు తమ్మారెడ్డి కుమారులు ప్రతాపరెడ్డి, ప్రహ్లాద రెడ్డిలు ఒకేసారి అనారోగ్య కారణాలవల్ల మృతి చెందడంతో మండల కేంద్రమైన తుగ్గలికి మేము సిద్ధం బస్సు యాత్రకు శనివారం వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి వారి ఫోటోలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రతాపరెడ్డి, ప్రహ్లాద రెడ్డి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. ఏ సమస్య వచ్చినా తమను సంప్రదించాలని శ్రీనివాస్ రెడ్డికి సూచించారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు, నాయకునికి అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులందరిని పేరుపేరునా పలకరించి వారికి ధైర్యం అందించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ ఇంచార్జి రామ సుబ్బారెడ్డి, మంత్రి పెద్ద రెడ్డి రామచంద్ర రెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కుమారులు రమణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు విజయలక్ష్మి, వైసిపి వింగ్ జిల్లా కార్యదర్శి మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి మండల స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐకెపి అధికారులపై చర్యలు తీసుకోవాలి:సిపిఎం

ప్రజాశక్తి-మద్దికేర

ఐకెపి అధికారులు ప్రభుత్వ విధులకు డుమ్మా కొట్టారని, వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి కడవల రవికుమార్ అన్నారు. మండల కేంద్రమైన మద్దికేరలో శనివారం ఐకెపి ఆఫీస్‌లో అకౌంటెంట్ సుశీల, సిసి రామకృష్ణ, అటెండర్ కాంతమ్మ మాత్రమే విధుల్లో ఉన్నారని తెలిపారు. మిగతా సంబంధిత ఐకెపి అధికారులు ఎవరూ ప్రభుత్వ విధుల్లో లేరని, వేలకు వేలు జీతాలు తీసుకుంటూ విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. సంబంధిత అధికారులు స్పందించి, విధులకు హాజరు కాని అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను కోరారు.

9,10 వార్డులలో కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని 9,10 వార్డులలో సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని జోన్ బాధ్యులు అబ్దుల్ దేశాయ్ ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. శనివారం ఉస్మానియా కళాశాల రోడ్, గుమ్మజు ప్రాంతాలలో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ తో అలయన్స్ ఉన్నట్లయితే తప్పకుండా ఓటు వేస్తామని ఓటర్లు తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఈ కరపత్రాల పంపిణీ కార్యక్రమంలో పార్టీ సభ్యులు మొహమ్మద్ హుస్సేన్, మూసా, ఖాదర్, ఇలియాజ్ ,మక్బూల్ తదితరులు పాల్గొన్నారు

డిజిటల్ క్లాసులపై అవగాహన లేకుంటే ఎలా?

- డిఇఒ, డిప్యూటీ డిఇఒ, హెచ్‌ఎంపై ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

డిజిటల్ విద్యా బోధనపై అధికారులకు అవగాహన లేకపోతే విద్యార్థులకు ఏ విధంగా పాఠ్యాంశాలను బోధిస్తారని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనలో భాగంగా శనివారం ఆయన గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా తొమ్మిదవ తరగతిని పరిశీలించారు. విద్యార్థులు ఏ మేరకు మెరుగుపడ్డారు అనే అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా బైజూస్, డిజిటల్ క్లాస్ రూమ్‌లు ఏ విధంగా బోధిస్తారో చూపించాలని డిఇఒ పగడాలమ్మను, డిప్యూటీ డిఇఒలను, హెచ్‌ఎం బిడ్డక భీముడును కోరారు. ఇందుకు వారు డిజిటల్ బోర్డు వరకు వెళ్లి తెల్లమొహం వేశారు. డైట్ ప్రిన్సిపల్‌గా పనిచేసిన అనుభవం ఉన్న మీకు బోధనపై కనీస అవగాహన లేకపోతే ఎలా అని డిఇఒను ప్రవీణ్‌ప్రకాష్ ప్రశ్నించారు. 'నేను వస్తానని గత వారం రోజులుగా చెబుతున్నా.. పాఠ్యాంశాల ప్రణాళిక రాయించకపోవడమేమిటి, నేనంటే అంత చిన్న చూపా'? అని మండిపడ్డారు. డిజిటల్ తరగతుల నిర్వహణకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తే వాటి పట్ల కనీస అవగాహన కూడా లేకపోవడం విచారకరమన్నారు. అనంతరం సవరకోటపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ప్రిన్సిపల్ సెక్రటరీ సందర్శించారు. నాలుగు, ఐదు తరగతుల విద్యార్థుల వర్క్ బుక్స్ పరిశీలించగా అసంపూర్తిగా నోట్స్ ఉండడంతో ఉపాధ్యాయులు, ఎంఇఒపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మారుమూలకొండలపై నున్న ఒండ్రుబంగి గిరిశిఖర గ్రామ ప్రాథమిక పాఠశాలను పరిశీలించి విద్యార్థుల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. కొత్తగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, కస్తూరిబా పాఠశాలను సందర్శించి విద్యార్థుల విద్యా ప్రమాణాలపై ఆరా తీశారు. ఆయన వెంట ఆర్‌జెడి విజయభాస్కర్, ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ సుగుణ, వి.శాంతీశ్వరరావు, డిఇ సింహాచలం, ఎంపిడిఒ జగదీష్ కుమార్, ఎంఇఒ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

పన్ను ఉగ్రవాదానికి పాల్పడడం దుర్మార్గం

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కాంగ్రెస్‌తో పాటు విపక్షాలపై ఆదాయపు పన్ను శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం పన్ను ఉగ్రవాదానికి పాల్పడడం దుర్మార్గమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. శనివారం వైఎస్ఆర్ జిల్లా వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బిజెపిది అధర్మ ఎన్నికల యుద్ధమన్నారు. బిజెపి చేతిలో ఐటి, ఇడి, సిబిఐలు కీలుబొమ్మలుగా మారిపోయాయని విమర్శించారు. ఇప్పటికే ఆదాయపు పన్ను శాఖ కాంగ్రెస్, యువజన కాంగ్రెస్‌కు చెందిన రూ.270 కోట్ల మేరకు 11 బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడంతో పాటు అందులో నుంచి ఆదాయ పన్ను శాఖ రూ.135 కోట్లు స్వాధీనం చేసుకుందని చెప్పారు. ఇది చాలక మళ్లీ రూ.1823 కోట్లు చెల్లించాలని కాంగ్రెస్ పార్టీకి, రూ.11 కోట్లు చెల్లించాలని సిపిఐకి డిమాండ్ నోటీసులు పంపడం దారుణమన్నారు. ఎన్నికల వేళ రాజకీయ ప్రత్యర్థి పార్టీలను ఆర్థికంగా దెబ్బతీయడమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మండిపడ్డారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమన్నారు. దేశం నుంచి ఆంగ్లేయులను తరిమికొట్టిన కాంగ్రెస్ పార్టీ.. బిజెపి ఉడత ఊపులకు భయపడదని తెలిపారు.

ప్రశాంత వాతావరణ ఎన్నికలకు ప్రతిఒక్కరి సహకారం అవసరం

- రిటర్నింగ్ అధికారి

మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని ఆళ్లగడ్డ నియోజకవర్గం ఎన్నికల అధికారి మల్లికార్జున రెడ్డి అన్నారు. పట్టణ ంలోని శ్రీరామ కళ్యాణమండపంలో శనివారం రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో నిర్వహించాల్సిన విధులు బాధ్యతలు పట్ల అధికారులు వ్యవహరించాల్సిన పనితీరుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆళ్లగడ్డ నియోజక వర్గంలో ఎన్నికల్లో పాల్గొనే అధికారులకు ఈవీఎం మిషన్లు, ఎన్నికల నియమా వళిపై, వారికి కేటాయించిన విధులపై అవగాహన కల్పించారు. అలాగే మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో గట్టి నిఘావేసి ఉంచాలన్నారు. శాంతి భద్రతల విషయంలో అప్రమత్తంగా ఉండా లని, ఎలాంటి సంఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ తాసిల్దార్ నజీర్ అహ్మద్, ఎంపీడీవో వెంకటరమణారెడ్డి, కమిషనర్ రమేష్ బాబు, ఎన్నికల డిటి చంద్రశేఖరయ్య, సిఐలు, ఎస్ఐలు, సెక్టోరల్ అధికారులు, ఇతర మండలాల ఎంపీడీవోలు, తాసిల్దారులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

జల సంపదను పరిశీలించిన నిపుణుల బృందం

ప్రజాశక్తి - మహానంది : మహానంది క్షేత్రానికి ఇంటాచ్ (ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్స్, కల్చర్ అండ్ హెరిటేజ్) ఢిల్లీ నుండి మిషన్ ఆన్ వాటర్‌కు సంబంధించిన నిపుణులు శ్రీ సుమేష్ దుదాని మహానంది క్షేత్రంలోని కోనేరులో గల జల సంపదపై అధ్యయనం చేయుటకు మహానందికి వచ్చారు. ఈ క్షేత్రంలోని నీటి వనరులను ఆయన సందర్శిం చారు. 27న దవళేశ్వరం బ్యారేజీ, 29న పోరుమామిళ్ల, కంభం ట్యాంకులు చెరువులను పరిశీలించిన వారు ఈరోజు ఇంటాచ్ నంద్యాల చాప్టర్ కన్వీనర్, శివకుమార్ రెడ్డితో కలిపి మహానంది క్షేత్రంలోని వాటర్ బాడీస్ హెరిటేజ్‌పై అధ్యయనం చేశారు. వారితో పాటు సభ్యులు డాక్టర్ సహదేవుడు, గొల్ల సుదర్శనం, మారం శేషయ్య, డాక్టర్ కిషోర్, సుబ్బయ్య, రామయ్య, బి. చంద్ర పల్లా నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణా ధికారి చంద్రశేఖర్ రెడ్డితో కార్యాలయంలో ఈ విషయంపై చర్చించారు. ఈ కోనేరుకు సంబంధించిన పురాణ ప్రాశస్త్యాన్ని ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధానితో మాట్లాడి తెలుసుకున్నారు. మహానంది క్షేత్రానికి మాత్ర మే ఉన్న ఈ జల ప్రత్యేకతలను పరిశోధనాత్మకంగా అధ్యయనం చేసి దేశమ ంతా తెలిసేలా చేయుటకు ప్రయత్నిస్తామని ఇంటాచ్ నిపుణులు తెలిపారు.

జల సంపదను పరిశీలిస్తున్న నిపుణుల బృందం